చెప్పాలిగాని నీ యిష్టంవచ్చినట్లు వాగకూడదు ' అని కోపపడ్డారు వాదిని కోర్టువారు.

ఆమె వెంటనే కళ్ళమ్మట నీళ్ళెట్టుకున్నదై, గద్గదం పడుతూ ఆకాశంవంక చూచి ' ఆ దేవుడుసాక్షిగా చెబుతున్నాను ఇప్పటికి పదేళ్ళుగా నన్నూ. ఈ బిడ్డణ్ని వదలిపెట్టి నాభర్త—

కోర్టువారు ' ఆగు! వ్రాసుకోనీయి ' అన్నారు.

అంతట్లో గడియారం అయిదుకొట్టింది. కలం ఆలాపడేసి కేసు మర్నాటికి వాయిదా వేశానన్నారు కోర్టువారు.

మర్నాడు వాది మరికోర్టుకురాలేదు. కుర్రవాణ్ని ఆమె కోర్టుకు పంపలేదు. కారణం అడిగితే ఆమె ప్లీడరుగారు చెప్పిన సాక్ష్యం చాలదా డిక్రీ ఇవ్వడానికంటూ వాది వాని పిల్లాణ్ని తీసుకువెళ్ళిపోయింది అని కోర్టువారికి సమాధానం చెప్పారు.

కోర్టువారికి పచ్చివెలక్కాయ గొంతుకపడ్డట్టయింది. ' రిజాలాగా తిరుగుతున్నాడు ' అని వాఙ్మూలం పూర్తి చేయడమా ? మానివేయడమా ?

## అడవి ప్రేమ

ఆ క్రితంరాత్రి రెండోజాముదాకా ప్రజ్వరిల్లి, కొండలనుండి పార్శ్వ మండలి పల్లెటిపట్టుకు, కాంతిగొల్పిన దవానలజ్వాలలు, అనుకోని ఝుంఝూమారుతానికి జవజవలాడి, చరచరరేగి, చప్పున చల్లారి పూరుకున్నాయి, పెద్ద కుంభవృష్టిగా కురిసిన ఒకానొక తొలకరి వానకు.

ఆ రాత్రి రెండోజామునుండి చీకటిగుయ్యారం సమస్తం. కారుమబ్బులు మెరిసే మెరపు తప్పిస్తే! సమస్తం నీరవని స్పహోయం. ప్రతిధ్వనించే ఉరుము తప్పిస్తే! భూమిమీది జీవ కళనంతా. భూమిమీది తేజస్సునంతా. భూమిమీది సారమునంతా. పైకి చివ్వన లాగికొని. మోసికొని పీల్చికొని. పైనుండి పటాపంచలుగా పంచుతున్నట్టు పీటమీద లిట్టిల్టే వేసి తీస్తూ వున్నట్టు. చిమ్మట కొట్టినట్టు. కాదంబినీమాల ఆరేయి విజృం భించి ఒక్కధారగా ప్రవర్షించింది పక్కా రూం:

తెరపి యిచ్చిన మూడోజామునందలి మొదటి ముహూర్త భాగం కూడా. ఆకాశమందు కరి కరి మొయిళ్ళే ఆవరించుకొని వున్నాయి; కాసంత చుక్క వెలుగు గాని. కంజాతకలికపు విప్పు గాని వెలిసింది లేదు.

ఆ కొండల్లో కెల్లా విశ్రుతి కెక్కిన కొండ "ఊటకొండ" దాని ప్రక్కనున్న కోయకుప్పం "ధారాపల్లి" వెదురుకంచెలు కోటగోడల్లా వినిర్మించుకొని. ఊటకొండచాటు చలువనే పది పదేను కంప కొంపలలో. ఆయుపుకు అంజలి లొగ్గుతూ. అస్త మానం ఆ చుట్టుపట్ల అడవినే మసలుతూ. రాత్రి పదేటప్పటికి. గూళ్ళకు పక్షుల్లా అనభిజ్ఞులు తమతమ తావులకు చేరుకొని. గుండెలమీద చేతులు వేసికొని నిర్భీతిగా నిదురించడం రివాజు.

పెళ్ళికాని కోయపడుచులు. కోయయువకులు. ఉబుసు పోకకైతేనేమి. ఉండబట్టలేక అయితేనేమి. షోకు కబుర్లు రహోవ్యధలు. "సుబ్బు" కుంటూ. మంచెలమీద కెక్కి. మంచాలక్రింద నక్కి. అన్యోన్యం చీకటిచాటు ప్రగల్భాల ప్రవర్తిస్తూ వుండడం. ఆ పల్లె కదోనిండు.

అయితే నాటి రాత్రి మెరపుతేటుకు జంకి " బొర్రదొర " "దుమ్ములమ్మ " ఇరువురు ఆ యూరిలో తమ అవివాహిత యౌవన శ్రీ వికాసాన్ని వెల్లడికానీయకుండా, వెర్రి ఆకాశాన్ని ఒకసారి, మర్రి రాకాసుల్ని ఒకసారి చూస్తూ, కళ్లు చీకట్లు కమ్మి పిడుగుచప్పుళ్ళ చెవులు గళ్ళడిపోతూవుంటే, కదల తావు లేక, ఒకరి నొకరు వదల చేవలేక, పరిబంధితులైనట్టు, ఆపల్లెటి పట్టునే ఒక పంచ పిల్చుంది పోయినారు అంత వానలోను, అంత గాలిలోను!

అలా వాన వెలిసింది, ఇలా గాలి కెగిరిపడ్డట్టు ఒక మగపులి, దాని వెనుకనే ఒక ఆడపులి, వాళ్ళ కాళ్ళదగ్గర కురికాయి! అవి వాటి గ్రుడ్లతో ఒకదానిమీద కొకటి చింత నిప్పులు చెరుక్కుంటూ, గాండ్రు గాండ్రుమని, ఒకప్పుడు ఎదురెదురుగాను, ఒకప్పు డొకదాని తోక నొకటి కరచుకొంటూను-"ఆండ్రింపు" అనుకోడానికి వీల్లేకుండా, ఆహవకేళి అనుకోడానికి వల్లకాకుండా-విచ్చలవిడిగా "ధారాపల్లి" ఊరులో పడి భీభత్సం గొలుపసాగాయి. ఊళ్లోవాళ్లందరూ, వాన వెలిసిపోయిందన్న విరామం సుతరాం లేకుండా తమతమ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకు గుడ్డలు గుడిసెలు విడిచిపెట్టి, వెదురుబిదెపు పుంతలంట, ఎడాపెడా బలిసిన పొదలంట, పారిపో జొచ్చారు. కోళ్లు కొయ్యి లెక్కి కొండలెక్కి వేళకాకుండానే కొక్కొరోకో మంటూ చెల్లా చెదరైపోయాయి. కుక్కలు బొంయిబొంయిమని ఆ పెద్దపుళ్ల మీద కురికినట్టురికి అమాంతంగా వాటియొక్క పంజా ఆహతముకు ఆహుతి అయినాయి.

తూర్పురేఖలు ఉదయగిరి చీల్చుకు అగ్నిపర్వతపు జ్యోతిలా మారే తొలిసంధ్యకు, ఊళ్లో ఒక్క పులుగుగాని, ఒక్క పురుగుగాని లేదు. మనుష్యులు మటుమాయ మైనారు.

ఒకపులి మనుష్యమాంసం రుచిమరిగితే పట్టశక్యంగానిది, రెండుపుళ్లు ఊరిమీది కురికినాయి అంటే, జనం కోయవాళ్లే కానియ్యండి, కొండవాళ్లే కానియ్యండి. అడ్డుకోవడం అనేది ప్రాణగొడ్డంలాంటిపని.

అవితే మనుష్యులేమన్నా తమర్ని తినడానికి ఆ పెద్ద పుళ్లు ఆ రాత్రి ఊరిమీద పడ్డాయి అని అనుకున్నారే కాని - నిజంగా ఆ ముప్పన్నె మెకాలకా ఊహలేదు. అవి అన్యోన్యం అలింగనం అపేక్షించుకునో, లేక అసహ్యం వహించుకునో అలా తికమకపడుతూ తమ వళ్లు తామెరుగక ఇళ్ళమీద కా వేళ ప్పుడుపడ్డాయి. పడి తెల్లారింది కూడా తెలియనివై, అలాగే ఆ రెండు పులులూ ఒక దానితో ఒకటి కలబడుతూ, కొట్టు కుంటూ, ధారాపల్లి పొలిమేర దాటకుండా ధూకుడు కాబరిచాయి.

బొర్రదొర తిన్నగా ఒక తాటిచెట్టు ఎక్కిపోయినాడు, ఊరావల కొకమైలు పరుగెత్తి, వాని వెనకాలే దుమ్ములమ్మ తురంగలించి, తొంగలి రెప్పలు పైకెత్తుకు, ఈ తాటిచెట్టునే కావులించుకు, పైకెక్కలేక "ఒరే! ఏలారా" అని అడుగు తోంది. వెన్నుమీద మగపెద్దపులో ఆడపెద్దపులో అంగలో చరిచేస్తుంది అనేదే ఆ కోయపిల్ల ఫికరు.

అంతలో పెద్ద దద్దళం బెల్లువిరిగి నేలనుపడితే ఎంత చప్పుడౌతుందో అంత విడ్డూరపు చప్పుడు అయింది!

బొర్రదొర తాటిముప్పలో కూర్చొని, దూరంగా ధారాపల్లివంకకు చూస్తూ "దుమ్ములూ! మహా గుమ్మైన గుద్దు

గుద్దేసింది ఆడపులి. మగపులిముఖం మీద. మగపులి చచ్చి వూరుకుంది. అదిగో! ఆడపులి! ఆడపులి! రెక్కలు కట్టుకున్న లేడికంటె వడిగా కీకారణ్యంలోకి వెళ్ళిపోయింది! చచ్చిన మగపులి మొగాన్ని ఆడపులి పీకిపారేసిన గ్రుడ్లు. ఊడబుచ్చిన గోళ్లు. అవీ. మన ఊళ్లోవాళ్లు గుమిగూడి చూస్తూ. రిచ్చపోతూ వున్నారు. నీవు మరి తప్పుకో! నేను తాటిచెట్టు దిగాలి" అన్నాడు.

దుమ్ములమ్మ అనే ఆ యెమ్మెలాడి, "నానుతప్పుకోడ మెందుకురా. బొర్రనాయుడూ. దిగిరా! అలాగవితే! నా బుజా లొడ్డేని. నీ పాదాలకు" అంది. "నీవు కూడా నన్ను ఆ ఆడపులి మగపులిని వెంటాడించినట్టు ఈపైనుంచి వెంటాడించి చంపేస్తా వేమో?" అని అన్నాడు బొర్రదొర అన్న ఆ కుర్రడు.

దుమ్ములమ్మ అంది. "ఒరేవ్! మాంవా: మృగాలన్నవి ప్రేమించుకోవడం అంటే ఒకదాన్ని వొకటి చంపుకోవడం అన్నమాట! మనం నరమానవులం! ఒకళ్ళనొకళ్ళం బతికించు కుంటాం మన ప్రేమచేత. రారా! దిగరా: నేను చచ్చినా ఫరవాలేదని నన్ను విడిచిపుచ్చి నీవు తురతుర తాటితుద కెక్కి పోయి. నావంక మరిసూసినావు కాదు కావి. నా చూపులన్నీ నీవొంకకే తిరిగి వున్నాయి యీదాకాను" అంది. ఇలా బొర్ర దొరతో ఉబుసాడుతూనే వుంది. దుమ్ములమ్మ! మట్టమధ్యా హ్నం అయింది. మొవ్వనీడలు చెట్టుమొదళ్ళ ముసిలమ్మల్లా కూర్చుని వున్నాయి.

ఒక ఎలుగుబంటి అమాంతంగా నడచివస్తూ. దుమ్ములమ్మ కావలించుకున్న చెట్టునే రెండోప్రక్క గమ్మున కావలించుకు

పైకి మువ్వులోకి చూపులు చూడసాగింది. దుమ్ములమ్మకు తొ త్తి ఆ సంగతి తెలిసింది కాదు. తన రోకుతో మోకల్లుకు తాడిచెట్టు ఎక్కేసి బొర్రదొరతో సరిసమానంగా మువ్వులో కూర్చుందాం అనే ఆశయంలో మునిగివుంది. అతగాడు పైనుండి దిగకపోతే!

భల్లూకం చెట్టును కావులించుకున్న దూరుకోక గోళ్ళతో గీరసాగింది. తాటిచెట్టు చర్మం గరగరామంది. అది విని దుమ్ములమ్మ సన్నతెలిసి సాహసించి ఆ ఎలుగ్గొడ్డుయొక్క రెండుచేతులూ లాగిపట్టి "ఒరేవ్! దొరా! ఎలుగ్గొడ్డు నీవంక చూస్తూవుంది!" అంది నవ్వుతూ. "చచ్చాను" అని కేకేశాడు బొర్రదొర. "ఫరవాలేదు అలాగే వుండు నీవు మువ్వులో" అంటూ, తాను ఆ ఎలుగ్గొడ్డుయొక్క రెండుకాళ్ళయొక్క పాదాల మీద తన పాదాలు పెట్టి అణచి దానిచేతుల్ని అలా అటొకటి ఇటొకటి తన చేతులతో ముందుకువూచి, ఆ అపరజాంబవంతుని బొరకు తాళవృక్షం రాచుకుపోయేలా - చూడండి! గునపం పాతి గెడ చీల్చే పద్ధతిని గుంజి గుంజి గుంజి గుంజి రాపాడించింది. ఆ రాపాడింపుతో చెట్టుచెట్టు ధరణి గ్రక్కదల, తలాడింప సాగింది. ఆడింపు కాడింపుకూ ఎలుగుబంటి చావు అరపులు అరవసాగింది. దాని బొరమీది వెంట్రుకలేకాకుండా, లోపలి తోలు, తోలు క్రింది కండ, కండలో గుండెకాయ, పరపర తెగి నెత్తురు వరద అయిపోయింది.

దుమ్ములమ్మ "ఇప్పుడన్నా దిగి వస్తావా? మరో ఎలుగ్గొడ్డును పిలవనా?" అంది బొర్రదొరకేసి - బొర్రదొర మీద నున్న నీలనీల ఆకాశంకేసి చూస్తూ.

బొంగ్రదొర కిందకు దిగుతూ "నివ్వే? ఈ ఎలుగ్గొడ్డును చంపింది?" అని అడిగాడు. "నేనేగాని నేనంటే నీకెందుకురా అంతభయం!" అని దుమ్ములమ్మ బొంగ్రదొరను, తన ఎదు రొమ్ము నిండుగుండ్రందనాల చక్కందనాన్నే గగురుపొడిచి యున్న సూదివాడి చూచుకాగ్రాలతో కుర్రతనంకొద్ది అదిమి పట్టి బిగియార గుచ్చుకొన్నదై "ఎలుగ్గొడ్డుకు ప్రాణం గుండె కాయ నంటిపెట్టుకొని వుంటుంది. దొరా! నావంటి ఆడదానికి ప్రేమ గుండెకాయ నంటిపెట్టుకు వుంటుంది దొరా!" అంది. అంటూ గతరాత్రి మబ్బుకంటె ముమ్మరంగా ముద్దులు కురిపించింది.

బొంగ్రదొర ఒక నిమేషం ఉక్కిరిబిక్కిరై. ఎట్టకేలకు "ఉండు. సర్దుకోనియి. అలాగా?" అని అన్నాడు మంద హాసంతో మెరసి!

## కబ్బన్ పార్కు

"చైత్ర వైశాఖ మాసములు వసంతఋతువు" అని చదువుతూ

వుంది కూతురు, ఎనిమిది తొమ్మిదేళ్ళ పిల్ల. తనకు తానై స్వతంత్రించి ఎలెక్ట్రిక్ దీపం వేసికొని. చావడిలో తండ్రియొక్క కుర్చీమీద కూర్చుని.

వంటింట్లో భోజనం చేస్తూ. వడ్డించి నిలబడ్డ భార్యతో అంటున్నాడు భర్త: "ఈవూళ్లో చైత్రవైశాఖాలు గ్రీష్మ ఋతువు. వసంతఋతువని ఎలా వ్రాశాడో ఆ వ్రాసినవాడు?" భార్య "ఊరూరుకీ సరిపడేలాగూ, మనిషిమనిషికీ అక్కర